ఆలయంలో నీటి సౌకర్యం ఏర్పాటు

నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్రానికి చెందిన గడ్డం మల్లేష్ హైదరాబాదులో సైబర్ క్రైమ్ ఎస్సైగా విధులు నిర్వహిస్తూ తన సొంత గ్రామానికి తనవంతుగా అభివృద్ధి చేయాలని ఆకాంక్షతో సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మండలంలోని కాకుండా జిల్లావ్యాప్తంగా సైబర్ నేరాలపై ప్రజలకు, విద్యార్థులకు యువతి యువకులకు అవగాహన కల్పిస్తూ సైబర్ నేరాలు తగ్గేందుకు కృషి చేస్తున్నారు. మండల కేంద్రంలోని లొంక హనుమాన్ ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు ముందుకు వచ్చి సుమారు లక్ష ఇరవై వేల రూపాయలతో బోరు మోటర్ వేయించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సర్పంచ్ తునికి వేణు, నాయకులు సరస్వతి ప్రభాకర్, పరశురాములు తదితరులు ఉన్నారు.


బోరింగ్ ప్రారంభం

అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
సోమవారం 08 మే 2023

ఆస్తి పంచివ్వలేదని తల్లిమృతదేహాన్ని తీసుకెళ్లని కూతుర్లు

కామారెడ్డిలో అమానవీయ ఘటన



నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)

ప్రస్తుతం సమాజంలో రోజురోజుకూ డబ్బుపై పెరుగుతున్న వ్యామోహం.. కుటుంబ బాంధవ్యాలను చిన్నాభిన్నం చేస్తుంది. ఇన్ని రోజులు తల్లిదండ్రుల బాగోగులు చూడని కొడుకులను చూశాం. తాజాగా ఓ ఇద్దరు కూతుర్లు తమకు ఆస్తి పంపకాలు చేపట్టలేదని తల్లిమృతదేహాన్ని తీసుకెళ్లేందుకు నిరాకరించిన అమానవీయ ఘటన కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది.

వివరాలు మెయిన్‌లో..

పడకేసిన పంచాయతీ పాలన

- సమ్మెలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు
- అదే బాటలో జీపీ కారోబార్, సిబ్బంది
- జేపీఎస్‌ల సమ్మెకు సర్పంచుల మద్దతు
- పంచాయతీల్లో నిలిచిన పనులు.. పట్టని ప్రభుత్వం
- గ్రేడ్-1 కార్యదర్శులకు ఇంచార్జిలుగా బాధ్యతలు

నవతెలంగాణ-బోధన్

రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేసి నిధులు విడుదల చేసి అభివృద్ధి చేయడంతో జాతీయస్థాయిలో పలు పంచాయతీలు అవార్డులు అందుకున్నాయి. పల్లె ప్రగతి, తదితర పనులతో గ్రామాల రూపురేఖలు మారాయి. ఇంతటి ప్రగతి సాధించడంతో స్థానిక అధికారుల, సిబ్బంది కృషి ఎనలేనిది. అయితే రెగ్యూలర్ చేయాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, డిమాండ్‌లు నెరవేర్చాలని కారోబార్‌లు, జీపీ సిబ్బంది సమ్మె బాట పట్టడంతో పల్లె పాలన పడకేసింది. పంచాయతీ కార్యాలయానికి వెళ్తే కార్యదర్శి లేక, గ్రామాన్ని శుభ్రం చేసే సిబ్బంది లేక పాలన, పరిశుభ్రత అస్తవ్యస్తంగా మారింది. ప్రస్తుతం జూనియర్ పంచాయతీ కార్యదర్శులు వారి ఉద్యోగాలను క్రమబద్ధికరించాలంటూ గత పది రోజులుగా సమ్మెలో ఉండడంతో గ్రామపంచాయతీలు వెలవెలబోతున్నాయి. దాంతో జనన, మరణ ధృవీకరణ పత్రాలు, కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ దానికి కావాల్సిన పత్రాలు పెండింగ్ ఉండడంతో లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు.

పంచాయతీలు జాతీయస్థాయిలో ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డులు సాధించడంలో జూనియర్ పంచాయతి కార్యదర్శుల పాత్ర కీలకమైంది. 2019లో జూనియర్ పంచాయతీ కార్యదర్శులను నియమించిన ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్టం ప్రకారం మూడేండ్ల పాటు శిక్షణ కాలంగా నిర్ణయించింది. దాని తర్వాత మరో ఏడాది ప్రొబేషన్ కాలాన్ని మరో ఏడాది పొడగించింది. 2023 ఏప్రిల్ 11 తేదీ నాటికి జూనియర్ పంచాయతీ కార్యదర్శుల శిక్షణ కాలం నాలుగు సంవత్సరాలు పూర్తయినా ప్రభుత్వం వారిని క్రమబద్ధకరించలేదు. దాంతో వారు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు పిలుపునిచ్చారు. అప్పటినుండి గత పది రోజులుగా పంచాయతీలకు వెళ్లకపోవడంతో పాలన స్తంభించింది.

బోధన్ డివిజన్‌లో 80 మంది జేపీఎస్‌లు సమ్మెలో..

బోధన్ డివిజన్ లోని ఎడపల్లి, రెంజల్, బోధన్, సాలురా, రుద్రూర్, వర్ని, మోస్రా, కోటగిరి, పోతంగల్ మండలాలకు చెందిన 80 మందికి పైగా జూనియర్ పంచాయతీ కార్యదర్శులు బోధన్ ఎంపీడీవో కార్యాలయం వద్ద సమ్మెలో పాల్గొంటున్నారు. దాంతో గ్రామ పంచాయతీలలో పనులు చూసేవారు లేక పాలన ఇబ్బందిగా మారింది. ప్రతిపనికి పంచాయతీ కార్యదర్శులు ముఖ్యమైన వారు కావడంతో వారు సమ్మెలో ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దాంతో ప్రభుత్వం గ్రేడ్ వన్ పంచాయతీ కార్యదర్శులను ఒక్కొక్కరికి రెండు మూడు జీపీల చొప్పున ఇన్చార్జి కార్యదర్శులుగా బాధ్యతలు అప్పగిస్తూ పాలన కొనసాగిస్తున్నారు. దాంతో సీనియర్ పంచాయతీ కార్యదర్శులు పనిభారంతో ఇబ్బందులు పడుతున్నారు. కొంతమందికి వారు ఉన్న ప్రాంతం నుంచి 20 కిలోమీటర్ల దూరంలో ఇన్చార్జి బాధ్యతలు అప్పగించడంతో ఇబ్బందులు పడుతూ వెళ్తున్నారు. ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శులతో పూర్తి స్థాయిలో సేవలు అందకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు


తాళం వేసి ఉన్న కార్యాలయం.. ఏపుగా పెరిగిన మొక్కలు


పేరుకుపోతున్న డ్రయినేజీ చెత్త

పారిశుధ్యం అస్తవ్యస్తం..

పంచాయతీ కార్యదర్శులతో పాటు గ్రామపంచాయతీ సిబ్బంది పారిశుధ్య కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గత మూడు రోజులుగా సమ్మె చేపడుతున్నారు. దాంతో గ్రామపంచాయతీలలో చేపట్టవలసిన పారిశుధ్య పనులు చేయలేకపోవడంతో గ్రామాలలో ఎక్కడికక్కడే చెత్తాచెదారం నిండి పోయింది. దాంతో ఈగలు, దోమలతో జనం ఇబ్బందులు పడక తప్పడం లేదు. కనీసం ప్రజలకు ఉదయం సాయంత్రం తాగునీటి విడుదల చేయడం, వీధి దీపాలు వేయకపోవడంతో ఇబ్బందులు కలుగుతున్నాయి. అటు పంచాయతీ కార్యదర్శులు, ఇటు పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు సమ్మెలో ఉండడంతో పంచాయతీలో పాలన అస్తవ్యస్తంగా మారింది. దాంతో సర్పంచులు ఏమి చేయలేక మిన్నకుండి పోతున్నారు.

జేపీఎస్ సమ్మెకు సర్పంచ్ ల మద్దతు..

తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరుతూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు గత పది రోజులుగా సమ్మెలో వెళ్లడంతో గ్రామ సర్పంచ్ ల ఫోరం ఆధ్వర్యంలో వారి సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. బోధన్ మండల సర్పంచ్ ల ఫోరం ఆధ్వర్యంలో సోమవారం జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు సంఘీభావం తెలపడానికి తరలిరావడానికి సర్పంచ్ ల ఫోరం ఆధ్వర్యంలో కార్యచరణ ప్రకటిం చారు . అలాగే జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు ఒక్కొక్క సర్పంచ్ 2000/- రూపాయల ఆర్థిక సాయం చేయనున్నట్లు ప్రకటించారు. అలాగే గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో వారు కూడా నిరసన వ్యక్తం చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఏదేమైనా తెలంగాణ ప్రభుత్వం కీలకమైన పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది సమ్మెతో పాలన అస్తవ్యస్తంగా మారిందని విమర్శలు వస్తున్నాయి. కావున ప్రభుత్వం తక్షణమే స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

మా ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలి

బాలకృష్ణ. తెలంగాణ జూనియర్ పంచాయతీ కార్యదర్శుల రాష్ట్ర కార్యదర్శి



తమను విధులలో తీసుకున్న తర్వాత ప్రభుత్వం మూడేండ్లు శిక్షణ కాలం తరువాత రెగ్యూలర్ చేస్తామని చెప్పింది. తర్వాత మరో సంవత్సరం పొడగించినా విధులు నిర్వర్తించాం. నాలుగేండ్ల ప్రొబేషన్ పీరియడ్ ముగిసింది. ఇప్పుడు పర్మినెంట్ చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదు. తమకు ఇచ్చిన హామీ మేరకు తమను క్రమబద్ధీకరించే వరకూ మా సమ్మె శాంతియుతంగా కొనసాగిస్తాం.

భిన్నత్వంలో ఏకత్వం.. మన దేశం

స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-నసురుల్లాబాద్

మన దేశం భిన్న సంస్కృతి కలదని, మనది భిన్నత్వంలో ఏకత్వం కలిగిన దేశమని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఆదివారం బాన్సువాడ పట్టణం ఇస్లాంపూర కాలనీలో ఏర్పాటు చేసిన ఈద్ మిలాప్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో స్పీకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో అన్ని మతాలకు సమన్యాయం జరుగుతుందన్నారు. అందరూ కలిసిమెలిసి శాంతియుతంగా జీవిస్తున్నారన్నారని అన్నారు. మన దేశంలో మాత్రమే సర్వమత సమ్మేళనం ఉంటుందని విభిన్న మతాలు, సంస్కృతుల గురించి తెలుసుకోవడానికి వివిధ రంగాల నుండి కొత్త స్నేహితులను ఏర్పరచుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయన్నారు. ఈదుల్ ఫితర్ స్ఫూర్తిని తెలపడానికి అన్ని వర్గాల ప్రజలు ఒక చోట చేర్చడం సంస్కృతి సంప్రదాయం మరియు విలువలను పంచుకోవడం అన్ని వర్గాల మధ్య ఐక్యత అవగాహనను పెంపొందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ మతాల పెద్దలు, కార్యక్రమం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

రైస్ మిల్లర్లు డ్రామాలు మానాలి

- రైతులు ఎదురు తిరిగే రోజులు వస్తాయి : బీఆర్ఎస్

నవతెలంగాణ-దోమకొండ


మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

దోమకొండ మండల కేంద్రంలో రైస్ మిల్లర్లు డ్రామాలను మానుకొని ధాన్యాన్ని దింపుకోవాలని జడ్పీటీసీ తీగల తిరుమల్ గౌడ్, విండో చైర్మన్ పన్యాల నాగరాజు రెడ్డిలు అన్నారు. ఆదివారం దోమకొండ మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ మంత్రి షబ్బీర్ అలీ శనివారం రోజు దోమకొండ మండల కేంద్రంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి లారీలు రావడం లేదని, ఓట్ల కోసం అసత్య ఆరోపణలు చేశారని తెలిపారు. దోమకొండలో ప్రతిరోజు ఐదు లారీలు ధాన్యం లోడ్ అవుతున్నాయని ఈ సందర్భంగా తెలిపారు. ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ రైతులకు ఇబ్బందులు కలగవద్దని రైస్ మిల్లర్లను దింపుకోవాలని ఆదేశాలు ఇచ్చారని దానిని రైస్ మిల్లర్లు తప్పుగా వక్రీకరిస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తూ వరి ధాన్యాన్ని దింపుకోవడం లేదని తేమశాతం ఎక్కువగా ఉందని మాటలు చెబుతూ రైతులకు ఇబ్బందులు చేస్తు కోతలు విధిస్తున్నారన్నారు. రైస్ మిల్లర్లపై రైతులు ఎదురు తిరిగే రోజులు రాకముందే రైస్ మిల్లర్లు ధాన్యాన్ని దింపుకోవాలని సూచించారు. రైస్ మిల్లర్లు కాలయాపన చేయకుండా ధాన్యాన్ని దింపుకొని రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. లేదంటే రైతులే రైస్ మిల్లర్లపై ఎదురు తిరిగే రోజులు వస్తాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నర్సారెడ్డి నల్లపు శ్రీనివాస్, గజవాడ శ్రీకాంత్, రాజిరెడ్డి, నాగరాజు రమేష్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

పంటలు పరిశీలించిన మంత్రి


పంటలను పరిశీలిస్తున్న వేముల ప్రశాంత్‌రెడ్డి

నవతెలంగాణ-మోర్తాడ్

మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన పంటలను మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని రైతులకు భరోసా కల్పించారు. కేసీఆర్ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రైతు సంక్షేమానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాడని, నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10 వేలు పరిహారం ఇవ్వనున్నట్టు తెలిపారు. వీటితోపాటు తడిసిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వం వరి కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు చేస్తుందని, రైతుల ధాన్యాన్ని తీసుకోవడంలో ఎఫ్సీఐ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టి రైతులకు ఇబ్బంది కలిగించే విధంగా కార్యకలాపాలు చేపడుతుందని అన్నారు. నష్టపోయిన వరి పంటలను రైతులు మంత్రికి చూపించారు.

మంజీరాలో మృతదేహం లభ్యం

నవతెలంగాణ-పిట్లం


పంచనామ చేస్తున్న పోలీసులు

మంజీరా నదిలో మృతదేహం లభ్యమైనట్లు స్థానిక ఎస్సై విజయ్ కొండ ఆదివారం తెలిపారు. మండలం లోని బొల్లక్‌పల్లి గ్రామ శివారు వద్ద గల మంజీరా నదిలో బాన్సువాడ మండలం బుడిమి వాసి ఉప్పరి మహేష్ (30) శనివారం ఇంటి నుండి బయలుదేరి ఆదివారం మంజీరా నదిలో అనుమా నస్పద స్థితిలో శవమై తేలాడు. మృతుడి భార్య గుణవతి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ చేపడు తున్నట్టు తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నట్టు తెలిపారు.

సర్పంచ్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-సదాశివనగర్

సదాశివ నగర్ మండలం యాచారం గ్రామ సర్పంచ్ లత అనారో గ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి రాగా.. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్ పరా మర్శించి ఆరోగ్య సమా చారం అడిగి తెలుసుకున్నారు. ఆదివారం వారి ఇంటికి వెళ్లి మాట్లాడారు. సర్పంచ్ కుటుంబాన్ని ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఏ సమస్య వచ్చినా తనను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌యస్ పార్టీ నాయకులు హాజరయ్యారు.

తడిసిన ధాన్యమూ కొనాలి

నవతెలంగాణ-ఎడపల్లి

తడిచిన, రంగు మారిన ధాన్యం సైతం రైస్‌మిల్లర్లు కొనుగోలు చేయాలని అఖిల భారత రైతు ప్రగతిశీల సంఘం జిల్లా కార్యదర్శి గుమ్మల గంగాధర్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆ ధాన్యం కొనుగోలు చేయబోమని రైస్‌మిల్లర్లు లేఖ పంపడాన్ని ఖండించారు. ఇప్పటికే అకాల వర్షంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. రాశులుగా పోసిన ధాన్యం తడిచి ముద్దయిందని, కావున అధికారులు స్పందించి రైస్‌మిల్లర్లపై చర్యలు తీసుకోని తడిచిన ధాన్యం సైతం కొనుగోలు చేసే విధంగా చూడాలని కోరారు.

ఇంకెంతకాలం బహిష్కరణ..?

- అధికారికంగా ప్రకటించినా మార్పు లేదు
- రామన్నపేట్ ముదిరాజ్ కులస్తుల ఆవేదన

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



మాట్లాడుతున్న రామన్నపేట్ గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్తులు

తమను ఇంకెంతకాలం బహిష్కరిస్తారని వేల్పూర్ మండలం రామన్నపేట గ్రామంలోని ముదిరాజ్ కులస్తులు ప్రశ్నించారు. తమపై నేటికీ గ్రామబహిష్కరణ కొనసాగుతూనే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. నిజామాబాద్ నగరంలోని ప్రెస్ క్లబ్‌లో ఆదివారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో రామన్నపేట గ్రామంలో విడీసీలు తమపై కక్షగట్టి ముదిరాజ్ కులస్తులను గ్రామ బహిష్కరణ చేశారనే ఆవేదనతో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. గతనెలలో అధికారులు గ్రామానికి వచ్చి బహిష్కరణ ఎత్తివేశామని మైక్ లో ప్రచారం చేసినట్టు ప్రకటించారని చెప్పారు. అధికారికంగా బహిష్కరణ ప్రకటించిన అనధికారికంగా గ్రామంలో బహిష్కరణ ఇంకా కొనసాగుతూనే ఉందని వాపోయారు. బహిష్కరణ విషయమై హైకోర్టులో కేసు వేయగా కోర్టు వారు గ్రామానికి వచ్చి విచారణ చేపట్టి బహిష్కరణ కొనసాగుతుందనే సమాచారం హైకోర్టుకు తెలియజేశారని అన్నారు. గ్రామంలో కొన్ని రోజుల నుంచి ఒక వర్గం వారిని ఉసిగొల్పుతూ తమపై అక్రమ కేసులు పెట్టడానికి ప్రయత్నం చేస్తున్నారని వారు ఆరోపించారు. అదేవిధంగా గ్రామంలో కొందరి నుంచి ప్రాణహని ఉందని రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రామ బహిష్కరణను పూర్తిగా ఎత్తివేసి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో జాగర్ల గంగ నర్సయ్య, గడ్డం భాస్కర్, గడ్డం సత్యనారాయణ, బోండ్ల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ యువగర్జన సభను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న చిన్నారెడ్డి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో నేడు (సోమవారం) నిర్వహించనున్న కాంగ్రెస్ యువగర్జన సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈ సభలో ప్రియాంకగాంధీ యూత్ డిక్లరేషన్ ప్రకటిస్తారని తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి మాట్లాడుతూ ప్రియాంక గాంధీ యువగర్జన సభలో యూత్ డిక్లరేషన్ ప్రకటిస్తారని తెలిపారు. కావున కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, యువకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. సమావేశంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సోప్పరి వినోద్, జిల్లా జనరల్ సెక్రెటరీ గన్న లక్ష్మణ్, మండల వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ గౌడ్, నారాయణ, ముత్తెన్న, అక్బర్, సాజిద్, పోషన్న సాయిలు, నారాయణ, ప్రశాంత్, చింటూ తదితరులు పాల్గొన్నారు.

రక్త దానం.. ప్రాణదానం

- నేడు అంతర్జాతీయ తల సేమియా రెడ్ క్రాస్ సొసైటీ దినోత్సవం
- రక్తదానానికి ముందుకు రావాలి : రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ బుస్సా ఆంజనేయులు

నవతెలంగాణ-కంఠేశ్వర్



రక్తదానం.. మరొకరికి ప్రాణదానంతో సమానం. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమున్నవారికి దాతలు ముందుకు వచ్చి రక్తదానం చేస్తే వారి ప్రాణం నిలిపిన వారవుతారు. అయితే తలసేమియా వ్యాధి గ్రస్తులకు రక్త ఎక్కించాల్సి ఉండటంతో రక్తం నిల్వలు నిండుకుంటు న్నాయి. అంతర్జాతీయ తల సేమియా రెడ్ క్రాస్ దినోత్సవం పురస్కరించుకొని.. రక్తదానం ప్రముఖ్యతపై పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ బుస్సా ఆంజనేయులు తెలిపారు. తలసేమియా దినోత్సవపై కథనం..

తల సేమియా ఒక జన్యు సంబంధమైన వ్యాధి. హిమోగ్లోబిన్ ఉండే ఎర్ర రక్త కణాలు ఉత్పత్తి నిలిచిపోవడాన్ని తలసేమియా వ్యాధి అంటారు. బిడ్డకు జన్మనిచ్చే తల్లి నుండే ప్రాణాంతక తలసేమియా వ్యాధి సంక్రమిస్తుంది. దీనిద్వారా జన్యువాహకులైన తల్లిదండ్రులకు జన్మించే బిడ్డల్లో 25-30శాతం మంది పుట్టకతోనే వ్యాధిగ్రస్తులయ్యే అవకాశం ఉంది. ఈవ్యాధి ముఖ్యంగా రెండు రకాలు. ఒకటి ఆల్ఫా తలసేమియా, రెండు బీటా తలసేమియా క్రిసిస్ కత్తిరాకారంలో రక్తాన్ని కట్ చేస్తూ ఉంటుంది. తలసేమియా రక్తంపైన తన ప్రభావాన్ని చూపిస్తుంది. శ్వాసతో పీల్చుకునే ఆక్సిజన్ను రక్తం ద్వారా శరీరంలోని అన్ని భాగాలకూ హిమోగ్లోబిన్ అందిస్తుంది. తలసేమియా రోగుల్లో శరీరానికి. అవసరమైనంత హిమోగ్లోబిన్ ఉత్పత్తి కాదు ఒకవేళ ఉత్పత్త యినా ఎక్కువకాలం అవి నిల్వ ఉండదు. హిమోగ్లోబిన్ నిల్వలు పడిపోయిన ప్రతిసారీ హిమోగ్లోబిన్‌ను కృత్రిమంగా రక్తం ఎక్కించి అందించాలి. సకాలంలో రక్తం ఎక్కించకపోతే చనిపోయే అవకాశం ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో రెడ్ క్రాస్ సొసైటీ తలసేమియా వ్యాధి గ్రస్తుల కోసం రక్త సేకరణకు ప్రత్యేకంగా కృషి చేస్తోంది.

నిజామాబాద్ జిల్లాలో రెడ్ క్రాస్ సొసైటీ 1976లో ప్రారంభం కాగా అప్పటినుండి రెడ్ క్రాస్ సొసైటీలో ఇప్పటివరకు ప్రమాదాల బారిన పడిన వారికి రక్తం తక్కువగా ఉన్నవారికి రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా రక్తం అందించారు. అయితే 2022 డిసెంబర్ నుండి తల సేమియా కు సంబంధించి పేషెంట్లకు రెడ్ క్రాస్ సొసైటీలోనే ప్రారంభించగా వారికి కూడా అక్కడే బ్లడ్ ఉచితంగా అందిస్తూ బ్లడ్ ఎక్కిస్తున్నారు. గత నాలుగు నెలలుగా నిజామాబాద్ జిల్లాతో పాటు కామారెడ్డి జిల్లా, అదిలాబాద్, నిర్మల్, భైంసా తదితర జిల్లాలోని ప్రజలు నిజామాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీలో తల సేమియాకు సంబంధించిన పేషెంట్లు సుమారు 141 మంది వరకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇందులో వారికి తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో తల సేమియా హాస్పిటల్‌ను ఏర్పాటు చేశారు. వారికి ప్రస్తుతం నాలుగు నెలలుగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమస్యలు లేకుండా తల సేమియా పేషెంట్లకు రక్తాన్ని ఎక్కిస్తూ వారి ప్రాణాలను కాపాడుతున్నారు. రక్తదానం చేసేందుకు దాతలు ముందుకు వస్తే మరింత మంది పేషేంట్లకు రక్తం అందించే అవకాశం ఉంటుంది కాబట్టి దాతలు ముందుకు రావాలని కోరుతున్నారు.

రెడ్ క్రాస్‌లో మెంబర్‌షిప్ తీసుకోవచ్చు

నిజామాబాద్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ బుస్సా ఆంజనేయులు



రాష్ట్రంలో నిజామాబాద్ జిల్లా ఎవరికైతే దగ్గరగా ఉంటుందో వారు కూడా నిజామాబాద్ జిల్లాలోని రెడ్ క్రాస్ సొసైటీలో మెంబర్షిప్ తీసుకోవ చ్చు. ప్రస్తుతం నిజామాబాద్‌లో రక్తం నిల్వల కొరత ఉంది. ప్రస్తుతం ఎండాకాలం దృష్ట్యా తల సేమియా, సికిల్ సెల్ బీటా క్రిసిస్ వారికి కూడా అవసరమైనప్పుడు రక్తం ఎక్కించాల్సిన అవసరం ఉంది. కాబట్టి ప్రజలు యువత ఇలాంటి వారికి రక్తదానం చేయాలి. కాబట్టి వీలైనంతమటుకు రెడ్ క్రాస్ సొసైటీలో రక్తదానం చేస్తే మీ వంతుగా తలసేమియా పేషెంట్లను బతికించిన వారవుతారు.

ప్రతి మహిళ బీమా చేసుకోవాలి

• ఏపిఎం కుంట గంగారెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

డ్వాక్రా సంఘాల్లో ఉన్న ప్రతి మహిళ తప్పనిసరిగా బ్యాంకులో బీమా చేసుకోవాలని ఎపిఎం కుంట గంగారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. పిఎంజెబివై, పిఎంఎస్బివై పథకం ద్వారా రెండు లక్షల ప్రమాద బీమా, రెండు లక్షల సాధారణ బీమా అవకాశం ఉందని, ఈనెల 21 నుండి 31 లోపు ప్రతి ఒక్కరు సమీప బ్యాంకుల్లో తమ పేరున విధిగా బీమా చేయించుకోవాలని సూచించారు. ఈ మేరకు రాష్ట్ర స్థాయి నుంచి ఆదేశాలు వచ్చాయని కావున మహిళా సంఘాల్లో ఉన్న ప్రతి సభ్యురాలు విధిగా బీమా చేయించుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా తమ భర్తలకు, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి బ్యాంకుల్లో ఈ బీమా చేసుకోవాలని సూచించారు.

అకాలవర్షం.. రైతన్న కష్టం



నవతెలంగాణ-కోటగిరి

అకాల వర్షాలు అపార నష్టం కలిగించడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రతిరోజు తడిసిన ధాన్యం శుభ్రం చేస్తున్నారు. సాయంత్రం వర్షం రావడంతో వారు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. ధాన్యం రైస్ మిల్లులకు చేరేవరకు రైతులకు దిన దిన గండంగా మారింది.

ఆగమవుతున్న ఆటోడ్రైవర్ల బతుకులు

• వచ్చింది ఇంటి అద్దెలు,, ఫైనాన్సు చెల్లింపులకే
• కుటుంబపోషణ, చదువులకు తప్పని ఇబ్బందులు
• ఆరోగ్యసమస్యలు వచ్చినా కష్టమే

నవతెలంగాణ-ఆర్మూర్

గడప దాటి ఎక్కడికి వెళ్లాలన్న గుర్తుకొచ్చేది ఆటో. ఉన్న ఊర్లోనే ఒకచోటి నుంచి మరోచోటికి వెళ్లేందుకు అత్యవసర సమయాలలో ఆటోవాలలే మనకు దిక్కు. అలాంటి ఆటోవాలాలే దుర్భర స్థితిలో జీవితాన్ని గడుపుతున్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా వారి బతుకులు మారడం లేదు. ఉన్న కష్టాలతో తోడు రోజు డీజిల్ ధరలు పెరగడం మరో పెద్ద సమస్యగా మారింది. సొంత ఇల్లు కూడా లేదని తమను ప్రభుత్వాలు ఆదుకోవాలని ఆటో కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కుటుంబం గడవడం కష్టమే..

నిత్యావసర సరుకులతో పాటు డీజిల్ ధర గత కాంగ్రెస్ ప్రభుత్వం లో 64 ఉండగా ప్రస్తుతం 100కు పైగా చేరింది. ఉదయం నుంచి రాత్రి వరకు ఎండనక, వాననక ఆటో నడిపితే తమకు నామమాత్రం కూలియే పడుతుందని వారంటున్నారు. అందులో నుంచి ఫైనాన్స్ ఇన్‌స్టాల్మెంట్లు, డీజిల్ ఖర్చులు పోను ఏమీ మిగలడం లేదంటున్నారు. ఆ మిగిలిన డబ్బుతోనే కుటుంబాన్ని నెట్టుకు రావాలని ఆవేదన చెందుతున్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి ఆటో నడుపుతున్నప్పటికీ కనీసం సొంత ఇల్లు కూడా లేదని డ్రైవర్లు చెబుతున్నారు. ఇంటి అద్దెలు,, ఫైనాన్సు, పిల్లల చదువులకు పోను కుటుంబం గడవడం కష్టం అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మధ్యలో ఆటో చెడిపోయిన, తమ ఆరోగ్యాలు పాడైన అప్పులు చేయాల్సిందేనని డ్రైవర్లు వాపోతున్నారు.

ఎనిమిది వందలకుపైగా

ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాలో కలిసి దాదాపుగా 8 వందల మంది ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. నూతన ఆలూరు మండలంతోపాటు గోవింద్ పెట్,, పెర్కిట్ ,మామిడిపల్లి, మచ్చర్ల, ఇస్సా పెల్లి, గగ్గుపల్లి తదితర గ్రామాల్లో ఒక్కో గ్రామం నుండి 20 నుంచి 30 మంది ఆటో డ్రైవర్లు ఉన్నారు. కొత్త బస్టాండ్, మామిడిపల్లి చౌరస్తా, పెరికిట్ చౌరస్తా, పాత బస్టాండ్ వద్ద అడ్డాలు ఉన్నవి. ప్రతిరోజు తమకు 3 నుండి 400 వరకు వస్తే డీజిల్ ఖర్చులకు పోను మిగిలినవి ఆటో ఫైనాన్స్ లకు చెల్లించగా వంద రూపాయలతో తమ కుటుంబాలను ఏ విధంగా పోషించుకోవాలని వాపోతున్నారు. పండగల సమయంలో ఏ మాత్రం గిరాకీ ఉండదని అప్పుడు పస్తులు తప్పవని డ్రైవర్లు వాపోతున్నారు..

కిస్తీలు చెల్లించలేక...

గతంలో ఆటో ధరలు లక్ష వరకు ఉండేది. నేడు మూడు లక్షలకుపైగా పెరగడంతో వాటి కిస్తీలు చెల్లించలేక డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారు.. ఫైనల్స్ వాళ్ల కిస్తీలు చెల్లించకపోతే తమ ఆటోలను లాకెళుతున్నారని డ్రైవర్లు ఆందోళన చెందుతున్నారు. గతంలో స్కూలు పిల్లలను చేరవేసి మిగిలిన సమయాలలో జనాలను తమ గమ్యస్థానాలకు చేర్చడం ద్వారా ఆటో డ్రైవర్లు ఆదాయం పొందేవారు.. ఇప్పుడు అన్ని పాఠశాలల్లో బస్సులు ఏర్పాటు చేయడంతో వీరికి ఉపాధి కరువైంది.

అధికారుల దాడులు..

గత కొన్ని నెలల నుండి ఆర్టిఏ, ఆర్టీసీ అధికారులు తనిఖీల పేరుతో జరిమానాలు విధిస్తున్నారని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్ టాక్స్, లైసెన్సు, ఇన్సూరెన్స్ ప్రభుత్వానికి కట్టాల్సి ఉందని. సంవత్సరానికి 10 నుండి 12వేలు అప్పులు చేయాల్సి వస్తుందని అంటున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



డీజిల్ ధరలు విపరీతంగా పెరగడం వల్ల ఆటో నడపడం భారంగా తయారైంది. 3000 అద్దె చెల్లించడం భారంగా తయారైంది. కుటుంబం గడపలేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాం. ప్రభుత్వం అందరికీ రాయితీలు ఇస్తున్నట్లు మమ్మల్ని ఆదుకోవాలి.

బొడ్డుల కుమార్, ఆటో డ్రైవర్, ఆర్మూర్

ఆటోడ్రైవర్లపై వేధింపులు మానుకోవాలి



బతుకుదెరువు కోసం ఆటోలు నడుపుకొని జీవిస్తున్న ఆటో డ్రైవర్ల పై వేధింపులు మానుకోవాలి. ఆటో డ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి. ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించిన పట్టించు కోవడం లేదు. నిరుపేద అటు డ్రైవర్లను గుర్తించి వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టించి ఇవ్వాలి..

ఆరేపల్లి సాయిలు, ఆటో యూనియన్ డివిజన్ కార్యదర్శి, ఆర్మూర్

కుర్నాపల్లిలో ఘనంగా మేడే ఉత్సవాలు



మాట్లాడుతున్న జంగం గంగాధర్

నవతెలంగాణ-ఎడపల్లి

మేడే ఉత్సవాల్లో భాగంగా మండలంలో కుర్నాపల్లి గ్రామంలో ఆదివారం సీపీఐ(ఎం) జిల్లా నాయకులు జంగం గంగాధర్ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జంగం గంగాధర్ మాట్లాడారు. కార్మికులు, కర్షకుల సమస్యలపై సీపీఐఎం ఎల్లప్పుడూ ముందుండి పోరాడుతుందన్నారు. అసంఘటిత కార్మికుల అభ్యున్నతికి పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి పనిచేస్తూ వారి కష్టసుఖాల్లో పాలుపంచు కుంటుందని ఆయన గుర్తు చేశారు. అంతకుముందుకార్మికులకు సామాజిక భోజనాలు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో.తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ సిబ్బంది యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు జోగ్గారి పద్మ, మండల కారోబార్ల యూనియన్. అధ్యక్షులు రాజు, పారిశుద్య కార్మికులు గోపి, సుదర్శన్, సావిత్రి, గంగాధర్, గరిగిండ్ల శ్రీనివాస్, కుంట సంతోష్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఫౌండేషన్ డే సెలబ్రేషన్స్



వేడుకల్లో పాల్గొన్న నలంద యాజమాన్యం, ఉపాధ్యాయులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లి నలంద పాఠశాలలో ఆదివారం ఘనంగా ఫౌండేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. దేశ భవిష్యత్ నాలుగు గోడలమధ్య తయారవుతుందని చెప్పిన మాటకు అతీతంగా నేటి ఆధునిక కాలానుగుణంగా ఎప్పటికప్పుడు విద్యార్థులను తేజోవంతగా తీర్చిదిద్దే గురుతర బాధ్యతను నలంద హై స్కూల్ సమర్థవంతంగా నిర్వహిస్తుందని యాజమాన్యం తెలిపింది. దీనికి సాక్ష్యంగా 18వసంతాలు పూర్తి చేసుకొని 19వ వసంతం లోకి అడుగు పెడుతున్న శుభ సందర్భంగా తల్లిదండ్రుల సహకారంతో మరింత ముందుకు వెళ్తామని అన్నారు. విద్యార్థులను నేటి పోటీ ప్రపంచానికి అనుగునంగా తయారు చేస్తామని కరస్పాండెంట్ ప్రసాద్, ప్రిన్సిపాల్ సాగర్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో నలంద స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

గోదావరిలో స్నానానికి వెళ్లి ఒకరు మృతి



గోదావరినుంచి మృతదేహాన్ని తీస్తున్న ఈతగాళ్లు

నవతెలంగాణ-ఏర్గట్ల

సరదాగా కాలక్షేపానికి తడపాకల్ గోదావరి నదిలో స్నానానికి వెళ్ళిన ఓ యువకుడు ఈతరాక మృతి చెందాడు. ఈఘటన మండలంలోని గోదావరి నది వద్ద చోటుచేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీనివాస నగర్ కు చెందిన ఆనంద్ (29) యూకో బ్యాంక్‌లో క్లర్క్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆదివారం నిజామాబాద్ నుండి తడపాకల్ గ్రామంలోగల ఆయన బాబాయ్ కొడుకు వివాహానికి హాజరయ్యారని తెలిపారు. కాలక్షేపం కోసం ఈతకు వెళ్ళి ఈతరాక ప్రమాదవశాత్తు యువకుడు మృతి చెందాడు. మృతునికి భార్య కుమారుడు ఉన్నాడు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పజెప్పినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రియాంక గాంధీ సభకు తరలి రావాలి

నవతెలంగాణ-మోపాల్

నేడు సరూర్ నగర్‌లో నిర్వహించే యువ సంఘర్షణ సభ ప్రియాంక గాంధీ వస్తున్నారని, మండలంలోని యువ నాయకులు, కార్యకర్తలు అందరూ తరలిరావాలని నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు ముప్పగంగా రెడ్డి తెలిపారు. తెలంగాణ వచ్చిన తర్వాత బీఆర్ఎస్ నిరుద్యోగ యువతీ యువకుల జీవితాలతో ఆడుకుంటుందని, తెలంగాణ ప్రజలకు ఉద్యోగాలు ఇవ్వని ముఖ్యమంత్రి మహారాష్ట్ర వాళ్లకు ఉద్యోగాలు ఇవ్వడం విచిత్రంగా ఉందని అన్నారు. ఇటువంటి ముఖ్యమంత్రిని గద్దె దించేంతవరకు పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు

నగరంలో మీని ట్యాంక్‌బండ్



ఆహ్లాదకరంగా ఉన్న ట్యాంక్‌బండ్ ప్రాంతం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ నగరంలోని ఖిల్లా రామాలయం వద్ద మీని ట్యాంక్ బండ్ నిర్మాణ పనులు పూర్తి అయ్యి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది, ట్యాంక్ బండ్ పైన మొక్కలను, కూర్చోవడానికి అక్కడక్కడ కుర్చీలను, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. ప్రశాంతమైన వాతావరణం, చల్లటి గాలి, ముందు నీరు, ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటయింది, అస్తమించే సూర్యుడు ప్రతిబింబం చూపరులకు ఆకట్టుకునే విధంగా ఉంది.

ఐలాపూర్‌లో బోనాల పండుగ

నవతెలంగాణ-లింగంపేట్



లింగంపేట మండలంలోని ఐలాపూర్ గ్రామంలో ఆదివారం నల్ల పోచమ్మ ముత్యాల పోచమ్మ లకు గ్రామస్తులు బోనాల తీశారు. ప్రతి సంవత్సరం లాగానే ఈసారి పండుగను వైభవంగా నిర్వ హించారు. ఆదివారం ఇంటింటి నంచి గ్రామస్తులు బోనాలను అలంకరించి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా డప్పు సప్పుల్లు, పోతరాజుల విన్యాసంతో ఊరేగింపుగా ఆలయాలకు చేరుకున్నారు. అనంతరం నైవేద్యం సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు.

మృతదేహంతో కుటుంబ సభ్యుల ఆందోళన

• ప్రేమించి పెళ్లిచేసుకోలేదని
• పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్య
• ఇందల్‌వాయి గ్రామంలో ఉద్రిక్తత
• ప్రేమికుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
• భారీగా మోహరించిన పోలీసులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి



ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు

ఇందల్‌వాయి మండలంలోని ఇందల్ వాయి గ్రామానికి చెందిన యువతి ప్రేమ విఫలం కావడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో గ్రామంలో ంష్రవ ఉద్రిక్త పరిస్థితులు నెలకొంది. మృతదేహంతో గ్రామంలోని మజీద్ ముందు కుటుంబ సభ్యులు, గ్రామస్థులు, పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. గ్రామస్తుల వివరాల ప్రకారం... ఇందల్ వాయి గ్రామానికి చెందిన గుండాల అష్మిత(18)కు అదే గ్రామానికి చెందిన సమీర్‌తో ప్రేమ వ్యవహారం కొనసాగుతోంది. శనివారం అష్మిత సమీర్ ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులతో పెళ్లి విషయం మాట్లాడింది. మతాలు వేరు కావడంతో సమీర్ కుటుంబ సభ్యులు పెళ్లికి వ్యతిరేకించి యువతిని ఇంటికి పంపించి వేసారని స్థానికులు తెలిపారు. గత్యంతరం లేక యువతి మనస్తాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రి తరలించాగ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ వార్త తెలియడంతో ప్రేమికుడు సమీర్ కుటుంబం ఇంటికి తాళం వేసుకొని పరారయ్యారు. ఆగ్రహించిన గ్రామస్తులు గ్రామంలోని మసీద్ ఎదుట శవంతో ఆందోళన చేపట్టారు. నిందితుడు వచ్చి బాధిత కుటుంబానికి కచ్చితమైన హామీ ఇచ్చే వరకు అంత్యక్రియలు నిర్వహించేది లేదని గ్రామస్థులు పేర్కొన్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య తీవ్ర ఉద్రిక్తకు దారి తీసింది. యువతీ మృతికి కారణం అయిన యువకుడు దొరికే వరకు మృతదేహన్ని తీసుకుపోయేది లేదని గ్రామస్థులు భీష్మించుకుని కూర్చున్నారు. దీంతో ఎస్ఐ నరేష్ ఆధ్వర్యంలో పోలిసులు భారీగా చేరుకున్నారు. డిచ్‌పల్లి సిఐ కృష్ణ, ఎస్ఐ కచ్చకాయల గణేష్, వివిధ పోలీస్ స్టేషన్ల సిబ్బంది గ్రామానికి చేరుకున్నారు. ఒక దశలో మజీద్ కమిటీ గేట్‌లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. అక్కడే మృతురాలి బంధువులు కుటుంబీకులు బైఠాయించి ధర్నా నిర్వహించారు. సమీర్‌ను తక్షణమే అరెస్టు చేసి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. యువతిని పెళ్లాడేందుకు ఒప్పుకొని అనంతరం ఆమెను మోసం చేయడం వల్లే ఆత్మహత్య చేసుకుని చనిపోయిందని మృతురాలి తాత రాజయ్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ ఐ నరేష్ తెలిపారు. మృతికి కారణమైన సమీర్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నామని తేల్చడంతో గ్రామస్తులు శాంతించారు.ఏలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

బీటీరోడ్డు పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన

నవతెలంగాణ-ముప్కాల్/మోర్తాడ్



మోర్తాడ్ :పనులకు శంకుస్థాప చేస్తున్న మంత్రి

రూ.4.47 కోట్ల రూపాయలతో జాతీయ రహదారి 16నుంచి జాతీయ రహదారి 7 దోన్కల్ మీదుగా ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామానికి బిటి రోడ్డు పునరుద్ధరణ పనులకు రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భ:గా మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సీఎం కేసీఆర్ ప్రతి పల్లెల్లో రోడ్లు బాగుండాలనే ఉద్దేశంతో రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలకు నిధులు విడుదల చేశారని తెలిపారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. రంగు మారిన ధాన్యం కేంద్ర ప్రభుత్వం కొనకుండా అడ్డుకుంటుందని మండి పడ్డారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని అన్నారు. కార్యక్రమంలో రెంజర్ల సర్పంచ్ ఆకుల రాజేశ్వర్, ఎంపీపీ సామ పద్మ-వెంకట్ రెడ్డి, జడ్పీటిసి సభ్యులు బద్దం నర్సవ్వ-నర్సారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్ రెడ్డి, వైస్ ఎంపీపీ ఆకుల చిన్న రాజన్న, ఉప సర్పంచ్ మోహన్ రెడ్డి, సొసైటీ ఛైర్మన్ కె.గంగాధర్, మండలంలోని ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోర్తాడ్:మండలంలోని గ్రామాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి ప్రశాంత్ రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. గత వర్షాకాలంలో చెడిపోయిన వంతెన, రోడ్డు నిర్మాణ పనులకు నిధులు మంజూరు కావడంతో నిర్మాణ పనులను చేపడుతున్నట్లు తెలిపారు. జాతీయ రహదారి 63 నుండి 43 వరకు నాలుగు కోట్ల 43 లక్షల రూపాయల నిధులతో తారురోడ్డు ు నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. దొనకల్ నుండి బాల్కొండ మండలం పోచంపల్లి రోడ్డుకు 90 లక్షల రూపాయల నిధులతో, శెట్టిపల్లి నుండి వన్నెల్ (బి) క్రాస్ రోడ్ వరకు మూడు కోట్ల 95 లక్షల రూపాయలతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి ప్రశాంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జడ్పిటిసి ఎంపీపీ సర్పంచులు ఎంపీటీసీలు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఉప్కాల్: మంత్రి పుష్పగుచ్చం అందజేస్తున్న సర్పంచ్

ఆదివాసి నాయకపోడు జిల్లా కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలో గల తాజ్ ఫంక్షన్ హాల్‌లో ఆదివాసి నాయకపోడ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు బండారి బొజన్న ఆధ్వర్యంలో జిల్లా ఆదివాసి నాయకపోడ్ సేవా సంఘం జిల్లా సర్వ సభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. జిల్లా ఆదివాసి నాయకపోడు బాడీ ఎన్నికసైతం జరిగింది. జిల్లా అధ్యక్షునిగా ఆలూరు గ్రామ నివాసి గాండ్ల రామచందర్ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ముప్కాల్ మండలం నల్లూరు గ్రామస్తుడు దేగాం సాయన్న, జిల్లా కోశాధికారిగా నిజామాబాద్ వాస్తవ్యులు శానం పవన్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ముప్కాల్ మండలం వేంపల్లి గ్రామస్తుడు లోలం గంగాధర్ ఎన్నికయ్యారు. అధ్యక్షులు గాండ్ల రామచంద్ర మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లాలో ఆదివాసి నాయకపోడు కులస్తులందరినీ ఏకం చేసి కుల సంఘ అభివృద్ధికి నిరంతరం పనిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసి నాయకపోడ్ కుల సభ్యులు 200మంది పాల్గొన్నారు

తెలంగాణ భరోసా సభకు తరలిన బీఎస్పీ కార్యకర్తలు



నవతెలంగాణ-బోధన్

బీఎస్పీ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ భరోసా సభకు బోధన్ మండలం నుంచి బీఎస్పీ కార్యకర్తలు వాహనాలలో తరలివెళ్లారు. నియోజకవర్గ ఇంచార్జి సింగడి పాండు ఆధ్వర్యంలో కార్యకర్తలు తరలివెళ్లారు. రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి ఈ సభలో పాల్గొంటున్నారని సింగడి పాండు తెలిపారు.

ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే షిండే

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్రంలో గల శ్రీ సాయిబాబా ఆలయాన్ని జుక్కల్ ఎమ్మెల్యే హనుమంత షిండే ఆదివారం సందర్శించి దర్శించుకున్నారు. ఆలయ పూజారి ఎమ్మెల్యేతో ప్రత్యేక పూజలు చేయించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలున్నారు.

ముగిసిన రథోత్సవం



విగ్రహాల ఊరేగింపు

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్రంలో గల రథం గల్లీలోని శ్రీ లక్ష్మీ నారాయణ ఉత్సవాలు ముగిశాయి. ఈ ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో సుమారు 5000 మంది భక్తులు పాల్గొన్నట్లు ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు.ఈ ఏడాది నిర్వహించిన రథోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించినట్లుతెలిపారు. కుస్తీ పోటీలకు సైతం పెద్దఎత్తున ప్రజలు వచ్చి వీక్షించారని తెలిపారు. సందర్శకుల సహకారంతో ఉత్సవాలు ఘనంగా విజయవంతమైయ్యాయిన, ప్రతిఒక్కరికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

ప్రశాంతంగా నీట్

- పరీక్ష కేంద్రం ప్రవేశద్వారం వద్దనే తనిఖీలు



పరీక్ష కేంద్రం వద్ద తనిఖీ చేపట్టిన సిబ్బంది


నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మెడికల్ కోర్సు ప్రవేశాల కోసం నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన నీట్ (నేషనల్ ఎలిజిబులిటీ కం ఎంట్రెన్స్ టెస్ట్) పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 3183 మంది విద్యార్థులకు గాను 3142 మంది హాజరవగా, 41 మంది గైర్హాజరైయ్యారు. పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.20 గంటల వరకు కొనసాగింది. అయితే విద్యార్థులను ఉదయం 11.30 గంటల నుంచి పరీక్ష హాల్‌లోకి ప్రవేశం కల్పించారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి ఉదయం 11 గంటలకు చేరుకొని, హాల్ టిక్కెట్ నెంబర్ ప్రకారం, పరీక్ష రాసే గదిని, పరీక్ష కేంద్రం వద్ద ఏర్పాటుచేసిన లిస్టులో చూసుకొని వెళ్లారు. విద్యార్థులకు గేటు వద్దనే పరీక్షా కేంద్రం నిర్వాహకులు హాల్ టికెట్ ను, ప్రభుత్వం చే గుర్తింపు పొందిన ఏదైనా ఒక (ఆదార్ కార్డు, పాన్ కార్డు ఒరిజినల్ వంటి) కార్డును చూయించి హాల్ టికెట్ పైన (రీసెంట్గా) హాల్ టికెట్ కు అతికించిన ఫోటో కాపీలను జత చేసి, పరీక్షా కేంద్రం వద్దనే పరీక్ష రాసే విద్యార్థి వేలిముద్రను హాల్ టికెట్ పై అచ్చు వేయించారు. గ్లాసెస్(కండ్ల జోడు), చేతి వాచ్, బంగారు ఆభరణాలు, పుస్తకాలు, బుక్కులు, సెల్ ఫోన్, ఇయర్ ఫోన్స్, పెన్ డ్రైవ్, టెక్ పెన్, క్యాలిక్‌లెటర్, ఆహారపదార్థాలు, పర్స్ (వ్యలెట్), కెమెరా వంటి వస్తువులను విద్యార్థులు పరీక్ష కేంద్రం లోనికి వెళ్ళడానికి ముందు గానే పర్యవేక్షణ చేసి విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి పంపించారు.



పరీక్ష కేంద్రం వద్ద గూమిగూడిన అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు

విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి



మృతిచెందిన గేదె

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని పోల్కంపేట్ గ్రామంలో విద్యుత్ షాక్‌తో పెద్దజాతి పాడి గేదె మృతి చెందిన ఘటన ఆదివారం వెలుగుజూసింది. స్థానికుల సమాచారం మేరకు గ్రామానికి చెందిన బండారు వెంకట్‌రెడ్డికి చెందిన పాడి గేదె రోజు మాదిరిగా శుక్రవారం ఉదయం మేత మేయడానికి వెళ్ళింది. అయితే రాత్రి ఇంటికి తిరిగి రాలేదు గేదె కోసం యజమాని చుట్టూ పక్కల వ్యవసాయ క్షేత్రల్లో వెతికినా జాడ కనిపించలేదు. ఆదివారం పెద్దవాగు సమీపంలోని వ్యవసాయ క్షేత్రంలో ట్రాన్సాఫార్మర్ వద్ద విద్యుత్‌షాక్‌కు గురి అయి మృతిచెంది ఉంది. మేత మేస్తున్న క్రమంలో వ్యవసాయ క్షేత్రంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న విద్యుత్ వైరు తగిలి అక్కడికక్కడే మృత్యువాత పడింది. సమాచారాన్ని విద్యుత్ శాఖ అధికారులకు అందించగా విద్యుత్ శాఖ జేఎల్ఎం రాజు సంఘటన స్థలానికి వెళ్లి పరిసరాలను పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులను పంపిస్తామనితెలిపారు. గౌడి బర్రె అని అది ప్రస్తుతం నిండు చూడితో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గేదె విలువ సుమారుగా 80 వేల పైన ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

రైతుల కోసం కొట్లాడండి..
రైస్‌మిల్లర్‌ల కోసం కాదు



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-భిక్కనూర్

బిజెపి నాయకులు రైతుల కోసం కోట్లడాలని, రైస్ మిల్లర్ల కోసం కాదని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, ఎంపీపీ గాల్ రెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వరి ధాన్యం తడిసి రైతులు ఇబ్బందులు గుర్తించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైస్ మిల్ యజమానులను ఆదేశించడం జరిగిందన్నారు. ఒక రైస్ మిల్లు గుమస్తా రైతులను ఇబ్బందులు పెడితే బాధిత రైతు ఎమ్మెల్యేకు తెలుపగా తక్షణమే ఎమ్మెల్యే అక్కడికి వెళ్లి గుమస్తాపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిపారు. కానీ ఎమ్మెల్యేపై బిజెపి నాయకులు లేనిపోని ఆరోపణలు చేయడం మానుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ భగవంత్ రెడ్డి, సిద్ధి రామేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, పట్టణ సర్పంచ్ వేణు, పట్టణ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మల్లేశం, డిసిసిబి డైరెక్టర్ కిష్టగౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

కల్తీతో విషం



- నిత్యావసర వస్తువుల్లో కల్తీలు
- అయినా పర్యవేక్షణ మరచిన యంత్రాంగం
- పలు హోటల్స్, బేకరీ, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లలో విరివిగా వినియోగం
- రోగాల బారినపడుతున్న ప్రజలు
- ఎక్కడా కనిపించని తనిఖీలు

నవతెలంగాణ-లింగంపేట్

ఉప్పు నుండి మొదలుకొని నిత్యవసర సరుకులు రోజు రోజుకు కల్తీ అవుతున్నాయి. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా పలు హెూటల్లు ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, బేకరీలు కల్తీ నూనెలు విచ్చలవిడిగా వాడుతున్నారు. యథేచ్ఛగా కల్తీ వ్యాపారం కొనసాగుతున్నా తనిఖీలు మాత్రం ఎక్కడ చేసిన దాఖలాలు కనిపించడం లేదు.

బియ్యం పిండికి రంగు కలిపితే అది పసుపు. పాలపొడిలో నీళ్ల కలిపితే చిక్కటి పాలు. అరటి కాడ గుజ్జుతో అల్లం వెల్లుల్లి పేస్టు, రసాయనం రుద్ది నిగనిగలాడే వివిధ రకాల పండ్లు. నాణ్యత లేని నూనెతో బిర్యానీ, చికెన్ 65, చిల్లి చికెన్ బట్టర్ చికెన్, నూడుల్స్ నాన్ వెజ్ వేపుళ్ళు స్వీట్ హెూములలో కల్తీ కలర్ పోసి తినుబండారాలు నోరూరిస్తుంటాయి. కానీ వాటిని తింటే రోగాల బారిన పడి ఆస్పత్రుల పాలువుతున్నారు.

కామారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని మారుమూల గ్రామాల్లో మండల కేంద్రంలో మున్సిపల్ కేంద్రాల్లో హెూటలలో రెస్టారెంట్లు ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు ధాబా హెూటల స్వీట్ హెూమ్ లో కిరణా దుకాణాలు వేల సంఖ్యలో ఉన్నాయి. అడుగు అడుగునా దర్శనమిస్తున్నాయి. లాభాల కోసం కల్తీ చేయడానికే మొగ్గు చూపుతున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అది తెలియక జనం వాటిని తింటూ అనారోగాల బారిన పడుతున్నారు.

ఫుడ్ ఇన్స్‌పెక్టర్‌లు ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టాల్సి ఉన్నా పర్యవేక్షణ లేదు. నమూనాలు సేకరించి ల్యాబ్‌కు తరలించి వాటి నాణ్యత పరీక్షించాల్సి ఉండగా.. ఇప్పటి వరకు చేపట్టిన దాఖాలాలు లేవు.

టీ పొడి నుండి పాలవరకు ఇలా ప్రతి ఒక్క దానిపై నాణ్యత ప్రమాణాలను పరిశీలించాలి. ఈ క్రమంలో నెలకు 12 నమూనాలను సేకరించి ఫుడ్ సేఫ్టీ లాబరేటరీకి పంపించాల్సి ఉంది. అక్కడినుంచి వచ్చే నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ జిల్లాలో ఇలాంటి చర్యలు ఎక్కడ కనిపించిన దాఖలు లేవు. ఫిర్యాదులు వస్తేనే తప్ప.. చర్యలు తీసుకోవడం లేదని మామూళ్ల మత్తులో అధికారులు అలవాటు పడుతున్నారని బహిరంగ విమర్శలు ఉన్నాయి. దీంతో కల్తీ వ్యాపారం జోరుగా కొనసాగుతుంది. ప్రజలు మోసపోతూ రోగాల బారిన పడుతున్నారు. అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని పలువురు మండిపడుతున్నారు.

హెూటల్ స్వీట్ డ్రీమ్స్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్లో అధికం

గ్రామీణ ప్రాంత ప్రజల నుంచి మామూలు అన్ని వర్గాల ప్రజలు రోజువారి కొలు నుండి మొదలుకొని వివిధ పనుల కోసం బయటకు వెళ్లే వారందరూ సై అవసరాన్ని బట్టి టిఫిన్, భోజనం, కోసం హెూటల్స్ రెస్టారెంట్లు డాబాలు ఆశ్రయిస్తున్నారు. అంతేకాకుండా ఫాస్ట్ ఫుడ్ తినేవారు అధికంగా ఉన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు టిఫిన్ సెంటర్లో నుండి హెూటల్స్ పాస్పోర్ట్ సెంటర్స్ డాబాలు రెస్టారెంట్లు స్వీటోములు వద్దా జనం రద్దీగా ఉంటారు. పెరిగిన నిత్యవసర సరుకుల ధరలతో పలువురు నిర్వాహకులు కల్తీ వైపు ముగ్గు చూపుతున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని హెూటల్స్ పాస్టఫుడ్ సెంటర్లలో మిర్చీలు బజ్జీలు వివిధ రకాల తినుబండారాలు నాణ్యత లోపించిన కల్తీ నూనెలతో వెజ్ నాన్ వెజ్ లాంటి తిండి పదార్థాలు తయారుచేసిన వాటిని ప్రజలు ఆకలితో తినేస్తున్నారు.

అడ్రస్ లేని ఆహార సంఘాలు

వినియోదారులను మోసాల బారి నుండి రక్షించు చైతన్యం నింపేందుకు గతంలో ఏర్పాటు చేసిన ఆహార సంఘాల జాడ లేకుండా పోయాయి. ఈ సంఘాల సభ్యులు కల్తీలు మోసాలను అరికట్టేందుకు మూడు నెలలకు ఒకసారి సమావేశం ఏర్పాటు చేసుకునేవారు. కానీ ఇప్పటివరకు ఆహార సంఘాలు అడ్రస్ లేకుండా పోయాయి. జిల్లాలోని కస్తూరి గురుకుల పాఠశాలతో పాటు ఆయా పాఠశాలలో కల్తీహారం తిని విద్యార్థులు అనారోగ్యల పాలయ్యారు. అయినప్పటికీ సంఘాలు తనిఖీ చేసిన దాఖలాలు లేవు. వారిపై చర్యలు తీసుకున్న సందర్భాలు లేవని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఫుడ్ ఇన్స్‌పెక్టర్ ఉన్నా పూర్తిగా నిఘా కొరవడింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టి నాణ్యత పాటించకుండా కల్తీ చేస్తున్న వ్యాపారస్తులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రైతుల ఖాతాల్లోకి నేరుగా ధాన్యం డబ్బులు

- బోర్గం సొసైటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

నవతెలంగాణ-మోపాల్

రైతులు పండించిన ప్రతి గింజనుకుంటామని, కొనుగోలు చేసిన వెంటనే రైతుల ఖాతాలోకి డబ్బులు జమ చేస్తున్నామని బోర్గం సొసైటీ చైర్మన్, ఎండిసిసిబి బ్యాంక్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం బోర్గం సహకార సంఘంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. తమ సంఘం పరిధిలో ఇప్పటివరకు బోర్గాం, తానకుర్దు సొసైటీ పరిధి గ్రామాల్లో 14,500 క్వింటాళ్ల ధాన్యాన్ని ఇప్పటివరకు కొనుగోలు చేసినట్టు తెలిపారు. ఇప్పటివరకు రైతుల ఖాతాలో ఒక కోటి 33 లక్షల రూపాయలు జమ చేసినట్టు తెలిపారు. ఆరు నెలల కాలం పాటు రైతులు కష్టపడి పండించిన ధాన్యానికి చివరి సమయంలో అకాల వర్షం వల్ల రైతులకు కన్నీరు పెట్టించిందని ఆయన తన ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే రూరల్ ఎమ్మెల్యే బాజి రెడ్డి గోవర్ధన్ సహకారంతో ప్రతిరోజు డిసిఓతో, అగ్రికల్చర్ అధికారులతో సంప్రదిస్తూ ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలిస్తున్నామని తెలిపారు. లారీలు, బార్దాన్ కొరత లేకుండా సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. తడిసిన ధాన్యాన్ని ఈ మధ్యన కలెక్టర్, డిసిఓ పరిశీలించారని కచ్చితంగా మొలకెత్తిన ధాన్యాన్ని కూడా కొంటామని తెలిపారు.

సంఘం పరిధిలోని కొందరు తన వ్యక్తిత్వం పై ఆరోపణలు చేసినా తాను మాత్రం పట్టించుకోకుండా తన సంఘం పరిధిలోని రైతుల గురించి ఆలోచిస్తానని సంఘం అభివృద్ధికి పాటుపడతానని తెలిపారు. సొసైటీ అధ్యక్షుడిగా చేపట్టిన రోజు నుండి ఇప్పటివరకు ఈ రోజు కూడా రైస్ మిల్లర్ యజమాన్యంతో కుమ్మక్కు అవ్వలేదని అటువంటి అవసరం తనకు లేదని తాను ఎప్పుడు రైతుల తరపున ఆలోచిస్తానని నేను కూడా రైతునేనని రైతుల బాధలు తనకు తెలుసు అని తన సంఘం పరిధిలోని రైతులందరికీ ఎల్లవేళలా ఫర్టిలైజర్ మరియు రుణాలు అందించాలని ప్రయత్నిస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ బూ జెందర్ రెడ్డి, మరియు డైరెక్టర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

- నిజామాబాద్ ట్రాఫిక్ ఏసీపీ నారాయణ



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ నారాయణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

రోజురోజుకు నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని రోడ్డు ప్రమాదాలను నివారించాలని అందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ట్రాఫిక్ రూల్స్ తూచా తప్పకుండా పాటించాలని నిజామాబాద్ ట్రాఫిక్ ఏసిపి నారాయణ తెలియజేశారు. తన కార్యాలయంలో ట్రాఫిక్ రూల్స్ రోడ్ సేఫ్టీ అనే అంశంపై ట్రాఫిక్ ఎస్ఐ, ఆర్ఎస్ఐలకు ఆదివారం అవగాహన కల్పించి పలు సూచనలు ఇచ్చారు. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా అలాగే నగరంలో ద్విచక్ర వాహనదారులు ఆటోవాలాలు నాలుగు చక్రాల వాహనాలు తమకిష్టానుసారంగా మితిమీరి వాహనాలను నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు ఈ మధ్యకాలంలో బాగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో వాటిని అరికట్టేందుకు, ప్రమాదాలు జరగకుండా చూసేందుకు, కట్టుదిట్టమైన చర్యలను చేపట్టబోతున్నామని అన్ని రకాల వాహనాదారులకు తెలియజేశారు. అందులో భాగంగానే నేటి సోమవారం నుండి నిజామాబాద్ లో సిగ్నల్స్ వద్ద వాహనాల తనిఖీలు చేపడతామని, రూల్స్ అతిక్రమించే వారిపై జరిమానా విధిస్తామని తెలిపారు. ట్రాఫిక్ కానిస్టేబుళ్లు సైతం నిజామాబాద్ నగరంలో అన్ని పాయింట్లల్లో ఉండనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఐ చంద్రశేఖర్ ట్రాఫిక్ ఎస్ఐ మధుసూదన్, ఏఎస్ఐ అనిల్‌తో పాటు 55 మంది కానిస్టేబుళ్లు ఈ అవగాహన సదస్సులో పాల్గొన్నారు.

జేపీఎస్‌ల వంటావార్పు



బోధన్‌లో ప్లకార్డుల ప్రదర్శన

- రాష్ట్ర ప్రభుత్వం స్పందించే వరకూ సమ్మెలోనే..

నవతెలంగాణ-నసురుల్లాబాద్

జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన సమ్మె లో భాగంగా ఆదివారం బాన్సువాడ డివిజనల్ కార్యాలయం వద్ద వంట వార్పు కార్యక్రమం నిర్వహించారు. వివిధ మండలాల నుంచి వచ్చిన గ్రామ కార్యదర్శిలు స్వయంగా కూరగాయలు తరుగుతూ వంటలు చేశారు. అనంతరం ముందుగా బోజనం వండి అమ్మవారికి సమర్పించి తమ సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ మనసు మారేలా చూడాలని వేడుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రొహిబేషన్ కాలం ముగిసినా తమను క్రమ బద్ధీకరించలేదని, కార్యదర్శిలకు రాష్ట్ర ప్రభుత్వం మొదట్లో సంవత్సరం శిక్షణ కాలాన్ని విధించి తర్వాత దాన్ని మూడేళ్ల పొడిగించిందని అన్నారు. ప్రస్తుతం నాలుగేళ్ల కావస్తున్నా రెగ్యులరైజ్ చెయ్యకపోవడాన్ని వారు తీవ్రంగా తప్పుబట్టారు. గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శుల కృషి ఉందని, తక్షణమే పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ డివిజన్ పరిధిలోని వివిధ మండలాల గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

భీంగల్: తమను క్రమబద్ధీకరణ చేయాలని కోరుతు చేపట్టిన జూనియర్‌పంచాయతీ కార్యదర్శుల సమ్మె ఆదివారం 10వ రోజుకు చేరుకుంది. పట్టణకేంద్రంలోని మండపరిషత్ కార్యాలయంలో మోకాళ్లపై నిలుచుని నిరసన వ్యక్తం చేశారు. ఈసమ్మెలో శేఖర్, గణేష్, జితెంధర్, శ్రీకర్, సంజయ్, మహేష్, కిషన్, రాజు తదితరులు పాల్గొన్నారు.



నసురుల్లాబాద్‌లో భోజనం చేస్తున్న జేపీఎస్‌లు

బోధన్ : బోధన్ మండల పరిషత్ కార్యాలయం వద్ద కొనసాగుతున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెలో వారు మాట్లాడుతూ...ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించే వరకు స్పందించే వరకు సమ్మె విరమించే ప్రసక్తి లేదనిహెచ్చరించారు. సమ్మెలో నాయకులు మహేందర్, సుధాకర్, రాజీవ్ గాంధీ, హరిత, శైలజ, పథ్వీరాజ్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని చోట్లా పోటీ



మాట్లాడుతున్న రాజుగౌడ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో ప్రభంజనం సృష్టించబోతుందని ఆపార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి రాజు గౌడ్ తెలిపారు. కరీంనగర్‌లో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈసారి ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పరిధిలోని తొమ్మిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థులను బరిలో నిలిపేందుకు రాష్ట్ర పార్టీకి వివిధ నియోజకవర్గాల వారిగా నివేదిక అందజేసినట్టు తెలిపారు. సమావేశాల్లో కీలకమైన నిర్ణయాలు తీసుకొని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఏ విధంగా ముందుకు వెళ్లాలో విధానపరమైన నిర్ణయాలు తీసుకున్నట్టు తెలిపారు.

డిమాండ్‌లు నెరవేర్చే వరకూ పోరుబాట

కొనసాగుతున్న ఐకెపి వివోఏల సమ్మె



ఎడపల్లిలో తమ పిల్లలతో కలిసి వీవోఏల నిరసన

నవతెలంగాణ-వర్ని

తమ డిమాండ్‌లు నెరవేర్చే వరకూ తాము పోరుబాట వీడబోమని ఐకేపీ వీవోఏలు స్పష్టంచేశారు. ఈ మేరకు వారు చేపట్టిన సమ్మె ఆదివారం కొనసాగింది. చందూర్, వర్ని మండల వివోఎలా యూనియన్ అధ్యక్షులు మాట్లాడుతూ రాష్ట్ర యూనియన్ పిలుపుమేరకు ప్రభుత్వం తమ డిమాండ్లను అమలుపరిచే వరకు సమ్మెను కొనసాగిస్తామని ప్రభుత్వం దిగివచ్చే వరకు తమ పోరు ఆగదని స్పష్టంచేశారు. తమకు కనీస వేతనం 18 వేల రూపాయల వేతనం ఇవ్వాలని, సీనియర్ వివో ఏ లను సిసిగా ప్రమోషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మెలో వర్ని, చందూర్ మండలాలకు చెందిన అధ్యక్షులు ఎస్.కె షమీం, మహేష్, అశ్విని, వినోద, రింకిత, సంజన, అను, అశ్విని, గిరి సాయిలు, జగపతి పలు గ్రామాల వివోఏలు తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి: ఎడపల్లి మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయం ఎదుట ఆయా గ్రామాల వివోఏలు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. కాగా ఆదివారం వీవోఏలు తమ పిల్లలతో కలిసి రిలే దీక్షలో కూర్చున్నారు. యూనియన్ ఎడపల్లి మండల అధ్యక్షులు పోచయ్య మాట్లాడుతూ వీవోఏ లకు సామాజిక ఉద్యోగ భద్రత పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని పలు డిమాండ్లు ఉన్నందున తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ,ఆ శాఖ కమిషనర్ స్పందించాలని ఇందులో పనిచేస్తున్న కుటుంబాలు నిరుపేద ,పేద ,సామాజిక వర్గాలకు చెందిన వారు ఎక్కువగా ఈ పథకంలో గ్రామ చేస్తున్నారని తెలిపారు. రిలే దీక్షలో కుమ్మరి పుష్ప, మంజుల, సుదర్శన్ , యూసూఫ్, చామంతి, ఆయా గ్రామాల వివోఏలు పాల్గొన్నారు.

భీంగల్: తమను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి 18వేల రూపాయలను వేతనంగా అందించాలని కోరుతు చేట్టిన సమ్మెలో 14 వ రోజు ఆదివారం తమ పిల్లా పాపలతో కూర్చున్నారు. ఐకెపిలో పనిచేస్తున్న తాము ప్రత్వానికి వ్యతిరేకం కాదని తమ న్యాయమైన డింమాడ్లను నెరవేర్చాలని కోరారు.

ఆర్మూర్: తమ సమస్యలను పరిష్కరించాలని ఆర్మూర్‌లో వీఓఏలు చేపట్టిన సమ్మెలో భాగంగా చిన్నారులతో నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణం స్పందించి తమ డిమాండ్లను అంగీకరించాలన్నారు. కార్యక్రమంలో ఐకెపి విఓఏల సంఘం మండల అధ్యక్షురాలు సువర్ణ, ఉపాధ్యక్షురాలు జ్యోతి, కార్యదర్శి రేఖ, సహాయ కార్యదర్శి సంతోష, కోశాధికారి స్రవంతి, వర్కింగ్ ప్రెసిడెంట్లు నర్సాగౌడ్, నారాయణ, వీఎవోలు పాల్గొన్నారు.

కోటగిరి: మండల కేంద్రంలో 14వరోజు నిరవధికంగా సమ్మె చేస్తున్న వీవోఏలకు బాన్సువాడ నియోజకవర్గ బీజేపీ ఇన్చార్జి మాల్యాద్రి రెడ్డి సంఘీభావం తెలిపారు ఉద్యోగ భద్రత కల్పించాలని, వారి న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు



ఆర్మూర్‌లో..

బహిరంగ సభకు తరలిన నాయకులు

నవతెలంగాణ-సదాశివనగర్

బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన బహిరంగ సభకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షుడు మొగ్గం నవీన్ మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుతో పేద వర్గాలకు చెందిన ప్రజలు ఇప్పుడైనా బాగుపడతాయని అనుకుంటే పరాయి పాలనలో కంటే దారుణంగా పేదలు మరింత పేదరికంలోకి నెట్టివేయబడుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని గద్దెదించడమే లక్ష్యంగా బహుజన సమాజ్ పార్టీ చేపడుతున్న తెలంగాణ భరోసా సభకు తరలివెళ్లినట్టు తెలిపారు. కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్ తో ఆవు మృత్యువాత



మృతిచెందిన ఆవు

నవతెలంగాణ-కోటగిరి

మండలంలోని ఎత్తొండ గ్రామ శివారులో గ్రామానికి చెందిన మటపతి విశ్వనాథ్‌కు చెందిన ఆవు ఆదివారం విద్యుత్ షాక్ తగిలి మృతి చెందింది. పూటకు 5 లీటర్ల పాలు ఇచ్చేదని, మూడు నెలల ఆవు దూడ ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. విషయాన్ని తెలుసుకున్న మండల పశు వైద్యాదికారి డాక్టర్ సురేష్ కుమార్ ఘటన స్థలానికి చేరుకుని శవ పంచనామా చేశారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్రంలోని దక్షిణ కాశీ శ్రీ సిద్ధి రామేశ్వర ఆలయ అభివృద్ధికి సిద్దిపేట్ జిల్లా కేంద్రానికి చెందిన ఆంజనేయులు కుటుంబ సభ్యులు ఆలయ అభివృద్ధి విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయంలో గల నంది విగ్రహానికి 25 వేల రూపాయల విలువగల ఇత్తడి తొడుగును సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ అందె మహేందర్ రెడ్డి దాతలను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు సిద్ధగిరి శర్మ, రాజేశ్వర శర్మ భక్తులు ఉన్నారు.

అల్లూరి వారసత్వంలో పోరాడుదాం

- అల్లూరి సీతారామరాజుకు విప్లవ నివాళి

నవతెలంగాణ- మోపాల్/ఆర్మూర్/నిజామాబాద్ సిటీ

మండల కేంద్రంలో సీపీఐ(యం-యల్) న్యూడెమోక్రసీ, ప్రజపంథా అనుబంధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజుకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి అగ్గు చిన్నయ్య మాట్లాడారు. బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా ఆదివాసీలు, గిరిజనులు, దేశ ప్రజలు చేస్తున్న స్వాతంత్రోద్యమంలో, ఆదివాసి హక్కుల కోసం పోరాడిన వీరుడు అల్లూరి సీతారామరాజుని అన్నారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి తన ప్రాణాలు అర్పించారన్నారు. పెట్టుబడిదారీ విధానానికి, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అల్లూరి సీతారామరాజు వారసత్వంలో దేశ ప్రజలందరూ పోరాడాలని పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వం, ఆదివాసీలను, గిరిజనులను, గిరిజనేతర పేదలను అడవుల నుండి వెళ్ళగొట్టే దుర్మార్గమైన చట్టాలను చేస్తుందన్నారు. ఆదివాసీలపై, గిరిజనులపై నిత్యం దాడులు చేస్తూ బూటకపు ఎన్కౌంటర్ల పేరుతో హత్యలు చేస్తున్నారన్నారు. నక్సలిజం పేరుతో అమాయకులైన ఆదివాసీలను, గిరిజనులను గిరిజనేతర పేదలను ఆపరేషన్ గ్రీన్ హంట్ పేరుతో వారి మధ్య వారికే విభేదాలు సృష్టించి ప్రచ్ఛన్న యుద్ధాన్ని చేయిస్తున్నారన్నారు. దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగిస్తున్నారన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వాలు గిరిజనులను ఆదివాసీలను నిలువునా దోపిడీ చేస్తున్నాయన్నారు. ఆదివాసీలకు గిరిజనులకు దళితులకు గిరిజనేతర పేదలకు జరుగుతున్న అన్యాయాలపై అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు బండమీద నర్సయ్య , గ్రామ సర్పంచ్ క్యాతం రవి. ఎంపీటీసీ ముత్తన్న, వి డి సి పెదకపు జనార్దన్ ,దండు నర్సయ్య, ప్రవీణ్, ఉపసర్పంచ్ రవి, నవీన్, యువజన నాయకులు గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్: ప్రధాని మోడీ అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదామని ప్రజాపంథా డివిజన్ నాయకులు రాజన్న అన్నారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 99 వ వర్ధంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని కుమార్ నారాయణ భవనంలో నివాళులు అర్పించినారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రిటిష్ వలసవాదులకు వ్యతిరేకంగా విశాఖ మన్యం ప్రాంతంలో అడవి బిడ్డలను కూడగట్టి వారికి అక్షరాలను యుద్ధం నైపుణ్యాలను నేర్పించి పోరాట బాటలో నడిపిన అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో నేటి యువతరం మతోన్మాదానికి, స్వదేశీ పాలకుల దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదామని పిలుపునిచ్చారు. సబ్ డివిజన్ నాయకుడు ఠాకూర్ మాట్లాడుతు మన్యం వీరుడు అల్లూరి ఆనాడు ఈ దేశ సంపదను దోచుకుంటున్న వలస వాదులకు వ్యతిరేకంగా పోరాటం చేశాడని ఆయన అందించిన స్ఫూర్తితో నేడు ఈ మోడీ ప్రభుత్వం ఈ దేశ సంపదను అంబానీలకు ఆదాని లకు స్వదేశీ, విదేశీ బడా పెట్టుబడిదారులకు కట్ట పెడుతున్న తీరుకు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం అన్నారు. కార్యక్రమంలో ప్రజా పంథా నాయకులు శేఖర్, రమేష్ దుర్గా ప్రసాద్, పద్మ లక్ష్మి, వివిధ ప్రజా సంఘాల నాయకులు నజీర్, బోట్ల రాజు , నిఖిల్, వినోద్, వంశీ అనిల్ రోజాలు తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ సిటీ: సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా ఆధ్వర్యంలో కోటగల్లిలోగల అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలతో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ మాట్లాడుతూ... ఆదివాసీ, గిరిజనుల హక్కులను కాలరాస్తున్న నేటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను అల్లూరి స్ఫూర్తితో ప్రతిఘటించాలన్నారు. అడవులపై ఆదివాసులు, గిరిజనులకే హక్కులు ఉండాలని పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా నగర కార్యదర్శి ఎం.సుధాకర్, సిఎల్ సి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆల్గోట్ రవీందర్, ఏఐపికెఎంఎస్ జిల్లా అధ్యక్షులు సాయగౌడ్, పార్టీ నాయకులు గంగమల్లు, లింగం, జలేందర్, భాస్కరస్వామి, ప్రశాంత్, సాయితేజ, గంగారాం, కిరణ్ ఉన్, రమేష్, మహేష్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆర్మూర్: నివాళ్లు అర్పిస్తున్న నాయకులు



నిజామాబాద్ సిటీలో...



మోపాల్‌లో..

అ"పూర్వ"కలయిక



నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్ వాయి మండలంలోని నల్లవెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-2004 పదవతరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకుని పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం ఆసమయంలో తమకు బోధించిన అధ్యాపకులను ఘనంగా సన్మానించారు.20ఏళ్ళ తర్వాత ఒకరిని ఒకరు కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని వారు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

- పరిస్థితి విషమం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని సుద్దులం గ్రామానికి వెళ్లే మూల మలుపు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్ర గాయలపాలయ్యడు. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. సదాశివనగర్ మండలం భూంపల్లి గ్రామానికి చెందిన గొల్ల రాకేశ్ ద్విచక్రవాహనంపై డిచ్ పల్లి మండలం కోరట్ పల్లి గ్రామంలోని మల్లన్న ఆలయానికి వస్తుండగా రోడ్డుపై ఆగి ఉన్న లారీని ఢీ కొనడంతో రాకేశ్ కింద పడిపోయాడు. తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 అంబులెన్సుకు సమాచారం అందజేసి యువకుడిని నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి సంబంధించి ఫిర్యాదు రాలేదని డిచ్ పల్లి ఎస్ఐ కచ్చాకాయల గణేష్ తెలిపారు.

మాస్ కాపీయింగ్ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-తాడ్వాయి

మాస్ కాపీయింగ్ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రఘురాం అన్నారు. అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్ఎఫ్ కామారెడ్డి జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించరు. ఈ సమావేశానికి ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రఘురాం హాజరై మాట్లాడుతూ ఇటీవల్ల ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్ష కేంద్రాల్లో మాస్ క్యాపింగ్ పై చర్య తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ అఖిల భారత విద్యార్థి సమైక్య కామారెడ్డి జిల్లా కమిటీ డిమాండ్ చేస్తుందన్నారు. ఓపెన్ టెన్త్, ఇంటర్ మాస్ కాపియింగ్ పై జరిగిన అవకతవకల పైన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల నుండి వేలాది రూపాయలు వసూలు చేసిన ఇన్సులేటర్లను, ఎంఈఓ ను, డిఇఓ మాస్ కాఫీ పాల్పడిన అధికారుల పైన ఒకరికి బదులు మరొకరు ఎగ్జామ్ పదో తరగతి ఇంటర్ పరీక్షలు రాసిన టీచర్లపై కలెక్టర్ వెంటనే వీరిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని అన్నారు. విద్యార్థుల నుండి వేలాది రూపాయలు వసూలు చేసిన సెంటర్ లపై చర్య తీసుకోవాలని, ఇలాంటి వారిపై చర్యలు తీసుకోకుంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని ఏఐఎస్ఎఫ్ కామారెడ్డి జిల్లా కమిటీ డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు శివప్రసాద్, రిత్విక్, జస్వంత్, సంపత్, అరవింద్, రాజు, అరవింద్ రెడ్డి, నాగేందర్ పాల్గొన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండలం ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 9న మంగళవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశం మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు వాగ్మారే లక్ష్మీబాయి అధ్యక్షతన జరగనుందని, సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ, జట్పీటీసీలు, సర్పంచులు, సంబంధిత శాఖల మండల అధికారులు తమ తమ నివేదికలతో సకాలంలో హాజరు కావాలని సూచించారు.

బీటీ రోడ్డు పునరుద్ధరణ పనులు పూర్తి



ఏర్గట్ల-బట్టిపూర్‌గ్రామాల మధ్య పూర్తయిన బీటీ రోడ్డు

నవతెలంగాణ-ఏర్గట్ల

ఏర్గట్ల, బట్టాపూర్ గ్రామాల మధ్య బీటీ రోడ్డు పునరుద్ధరణ పనులు పూర్తి అయినట్లు ఆర్అండ్‌బి ఏఈ వినీత్ ఆదివారం తెలిపారు. మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సహకారంతో మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ నుండి ఏర్గట్ల, బట్టాపూర్ గ్రామాల మీదుగా తడపాకల్ గ్రామం వరకు అక్కడక్కడ పాడైన రోడ్డు పునరుద్ధరణ పనులకు కోటి 40 లక్షల రూపాయలు మంజూరయ్యాయని తెలిపారు. ప్రస్తుతానికి తిమ్మాపూర్ గ్రామం నుండి ఏర్గట్ల మీదుగా బట్టాపూర్ ఊర గుట్ట సమీపం వరకు రోడ్డు పనులు పూర్తయినట్లు చెప్పారు. మండలానికి చెందిన ప్రయాణికులు, రైతులు హర్షం వ్యక్తం చేస్తూ... మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న మదన్‌మోహన్

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని ఐలాపూర్ గ్రామానికి చెందిన సంజీవ్ గత కొన్ని రోజుల క్రితం మరణించిన విషయం తెలుసుకున్న టీపీసీసీ ఉపాధ్యక్షులు మదన్‌మోహన్ ఆదివారం వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ అధ్యక్షులు నల్లమడుగు షరీఫ్, మాజీ సింగిల్ విండో వైస్ చైర్మన్ నారా గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ రాజు,మైనార్టీ నాయకుడు రఫీకుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చని మొక్కల మధ్య శ్మశాన వాటిక



నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

శ్మశాన వాటికను ఎంతో సుందరంగా తీర్చిదిద్దారు. నగరంలోని వర్ని రోడ్డులో గల శ్మశాన వాటిక అందంగా ముస్తాబు చేశారు. శ్మశాన వాటికలో పచ్చని మొక్కలు, పచ్చని గడ్డి తో అందంగా తయారు చేశారు. అంత్యక్రియలకు వచ్చిన వారు కూర్చోడానికి తగిన సీట్లను ఏర్పాటుచేశారు. స్నానాలు చేసేందుకు బాత్రూంలను స్త్రీ పురుష లకు ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. శవాన్ని కాల్చిన తర్వాత అస్థికలను (దాచుటకు) ఉంచుటకు ప్రత్యేక గదిని నిర్మించారు.

కేసీఆర్ పాలనలో ప్రతి ఇంట్లో సంక్షేమమే

- ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో ఏఇంట్లో చూసినా సంక్షేమం ఎవ్వరి కళ్ళల్లో చూసిన సంతోషమే కనిపిస్తుందని పీయూసీ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి అన్నారు. మండలంలోని అంకాపూర్ గ్రామంలో ఆదివారం ఎమ్మెల్యే నివాసంలో నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్, బీజేపీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు గొల్ల కురుమలు, విశ్వబ్రాహ్మణులు పెద్ద ఎత్తున బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించినారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న పనులను పూర్తిచేయాలని అన్నారు. పట్టణంలోని జంబి హనుమాన్ ఆలయం దగ్గర ఉన్న గ్రంథాలయంలో మొదటి అంతస్తు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో నష్టపోయిన వరి పంట పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ పస్కా నర్సయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత పవన్, వైస్ చైర్మన్ షేక్ మున్నా, పండిత్ పవన్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు..



వరిపొలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

బీసీల సంక్షేమానికి నిర్విరామ కృషి

- తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి అరుణ

నవతెలంగాణ-ఆర్మూర్

నేడు బీసీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిర్విరామ కృషి చేస్తానని తెలంగాణ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి అరుణ జ్యోతి అన్నారు . ఆదివారం పట్టణంలోని మామిడి పల్లిలో విలేకరులతో మాట్లాడుతూ బీసీల జనాభా దామాషా ప్రకారం వారికి రిజర్వేషన్లు కల్పించాలని ఎస్సీ ఎస్టీ లాగా బీసీలకు కూడా బీసీ అట్రాసిటీ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా దేశంలో బీసీల జనాభా అత్యధికంగా ఉందని, బీసీల పట్ల చిన్నచూపు చూడడం తగదని, బీసీలకు తగిన న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారత దేశంలో జనగణన వాటా లెక్కించాలని, విద్య, వైద్య, ఉద్యోగ రంగాలలో 57శాతం రిజర్వేషన్ ఉన్న బీసీలకు తప్పకుండా న్యాయం జరిగే విధంగా వారి రిజర్వేషన్ల ప్రకారం కేటాయించాలని తెలిపారు. కేంద్రంలో ప్రత్యేక బిసి మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. చట్టసభలలో బీసీలకు అన్ని పార్టీలు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు..



జర్నలిస్టుకు పరామర్శ

ఇటీవల చేతుకు తీవ్ర గాయమైన విలేకరి తిరుపతిని వారి స్వగృహంలో పరామర్శించారు పట్టణానికి చెందిన గంగ హాస్పిటల్ వైద్యులు అమృత్ రామిరెడ్డి చేతి వేలకు శస్త్ర చికిత్స చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం ఎస్సీ ఎస్టీ జిల్లా అధ్యక్షురాలు గూగులోత్ సుగుణ, రవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

14 అడుగుల అంబేద్కర్ విగ్రహావిష్కరణ

- పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లిలో 14 అడుగుల ఎత్తులో నిర్మించిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో పండిత్ పవన్, దళిత సంఘ నాయకులు కౌన్సిలర్లు కోన ప్రతి కవిత కాశిరాం, రవి గౌడ్ మాజీ ఎంపీటీసీ రాజా గంగారాం, ఐఎఫ్టియు దాస్, న్యాయవాది జిజి రామ్ తదితరులు పాల్గొన్నారు.మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన బంటు దయానంద్ దళితబంధు పథకం ద్వారా గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ తనకు 10 లక్షలు మంజూరు చేసిన నిధులతో పౌల్ట్రీ ఫారమ్ సముదాయాన్ని ఏర్పరుకున్నాడు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.



విగ్రహావిష్కరణలో పాల్గొన్న నాయకులు, కౌన్సిలర్లు

10 కిలోల గంజా స్వాధీనం

- పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు
- బైకు, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం
- చేసుకున్న టాస్క్ ఫోర్స్ సిబ్బంది

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఒకటవ పోలీస్ స్టేషన్ పరిధిలో 10 కిలోల గంజాయి ఉందనే సమాచారంతో ఆదివారం టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడులు నిర్వహించారు. దాడుల్లో ఓ వ్యక్తి వద్ద పది కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ సీఐ సిబ్బంది వెంకటేష్ తెలిపారు. పక్క సమాచారం మేరకు ఇంచార్జ్ ఎస్పి నిర్మల్ సిహెచ్ ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ టీమ్ సిఐ వెంకటేష్ కలిసి వన్ టౌన్ పరిధిలో డిచ్‌పల్లికి చెందిన సుధీర్, నాందేడ్‌కు చెందిన షాబాజ్ నుంచి పది కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని నిందితుల నుంచి ఒక బైకు, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని ఒకటవ పోలీస్ స్టేషన్లో అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ సిఐ తెలిపారు. అయితే ఈ కేసుకు ఈనెల ఆరో తేదీన రైల్వే స్టేషన్‌లో దొరికిన 250 గ్రాముల గంజాయి సంబంధం ఉందా.. లేదా.. అనే కోణంలో టాస్క్ ఫోర్స్ పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.



గంజాయి తరలిస్తున్న ఇద్దరిని పటుటకున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

నేడు చందూర్‌కు స్పీకర్ రాక

నవతెలంగాణ-వర్ని

చందూర్ మండల ప్రజాపరిషత్ సర్వ సభ్య సమావేశానికి సోమవారం తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి పోచారం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా విచేస్తున్నారని ఎంపిపి లావణ్య రాంరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు ఈ సమవేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.